మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య

జిల్లా విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం

• పింఛను కోసం ఎదురుచూపులు, వేధింపులు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు జిల్లా విద్యుత్ శాఖ అధికారుల నిర్వాకం ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఒక ఉద్యోగి మరణించి రెండేళ్లు గడుస్తున్నా పెన్షన్ మంజూరు చేయకపోవడం, మరొకరు బతికుండగానే చనిపోయినట్లు రికార్డులు సృష్టించి పెన్షన్ నిలిపివేయడం వంటి ఘటనలు వారి పనితీరుకు అద్దం పడుతున్నాయి.

సర్వీసులో ఉండగా మరణించినా లేదా పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు పెన్షన్ వారి కుటుంబ సభ్యులకు ఫ్యామిలీ పెన్షన్ అందించే పూర్తి బాధ్యత డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్లపై ఉంటుందని వారు స్పష్టం చేశారు. విద్యుత్ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులకు రెండు రకాల పెన్షన్ విధానాలు వర్తిస్తాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రివైజ్డ్ పెన్షన్ రూల్స్ (1980) ప్రకారం కొందరు అర్హులైతే, విద్యుత్ మండలి విభజన తర్వాత నియమితులైన ఉద్యోగులు గ్రాట్యూటీ చట్టం 1972 , ఇపిఎఫ్ చట్టం 1952 లోని పెన్షన్ స్కీమ్ 1995 ప్రకారం పెన్షన్‌కు అర్హులవుతారు. అయితే టిఎపి నెం: 65 ప్రకారం వీరికి గ్రాట్యూటీ మాత్రమే వర్తిస్తుంది.

సంవత్సరంలో ఎంతమంది పదవీ విరమణ చేశారు. ఎంతమంది విధి నిర్వహణలో మరణించారు. అనే పూర్తి సమాచారం అధికారుల వద్ద ఉన్నప్పటికీ, సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా మరణించిన లేదా పదవీ విరమణ చేసిన ఉద్యోగుల కుటుంబాలకు సంవత్సరాల తరబడి పెన్షన్ అందడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ జాప్యం జరగకుండా పెన్షన్ సెక్షన్‌ను తక్షణమే తనిఖీ చేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ఉద్యోగి సర్వీసులో ఉండగా మరణిస్తే ఫ్యామిలీ పెన్షన్ రూల్ 50 ప్రకారం, పదవీ విరమణ తర్వాత మరణిస్తే సూపర్యాన్యుయేషన్ పెన్షన్ రూల్ 33, 42 ఫ్యామిలీ పెన్షన్ రూల్ 59 ప్రకారం వారి కుటుంబానికి పెన్షన్ చెల్లించాల్సి ఉంటుంది. కుటుంబ పెన్షన్ మంజూరుకు కనీస సర్వీసు అవసరం లేదని, ఫ్యామిలీ పెన్షన్ (రూల్ 59) ప్రకారం ఉద్యోగి సర్వీసులో మరణిస్తే చివరి నెల బేసిక్ వేతనంలో 30 శాతం ఫ్యామిలీ పెన్షన్‌గా చెల్లించాలని వారు వివరించారు. ఏడేళ్ల కంటే ఎక్కువ సర్వీసు ఉన్న ఉద్యోగి మరణిస్తే, వారి చివరి బేసిక్ పేలో 50 శాతం లేదా మరణించిన ఉద్యోగికి 65 ఏళ్లు నిండే వరకు ఏది తక్కువైతే అది చెల్లించి, ఆ తర్వాత 30 శాతం చెల్లిస్తారని తెలిపారు. రిటైర్ అయిన తర్వాత మరణిస్తే, 65 ఏళ్లు నిండే వరకు బేసిక్ పేలో 50 శాతం ఫ్యామిలీ పెన్షన్ చెల్లిస్తారు.

నిర్లక్ష్యానికి నిదర్శనాలు:

ఓర్వకల్లు ఆపరేషన్ సెక్షన్‌లో లైన్‌మెన్‌గా పనిచేస్తూ 2023 అక్టోబర్ 25న మరణించిన ఎం.వసంత కుమార్ 1992 జనవరి 25న హెల్పర్‌గా ఉద్యోగంలో చేరారు. ఆయన మరణించి 17 నెలల 20 రోజులు గడిచినా, వారి కుటుంబానికి ఇంకా ఫ్యామిలీ పెన్షన్ మంజూరు కాలేదు. వారు ఆంధ్రప్రదేశ్ రివైజ్డ్ పెన్షన్ రూల్స్ (1980) ప్రకారం ఫ్యామిలీ పెన్షన్‌కు అర్హులు. సర్వీసులో ఉండగా మరణించినందున ఫ్యామిలీ పెన్షన్, గ్రాట్యూటీ, ఎర్న్డ్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, ప్రావిడెంట్ ఫండ్ మొత్తం, ఎక్స్ గ్రేషియా, గ్రూప్ ఇన్సూరెన్స్ సొమ్ము, సేవింగ్ ఖాతాలో నిల్వ , విద్యార్హత ప్రకారం కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాల్సి ఉండగా, ఏ ఒక్కటీ అమలు కాలేదు. ఉద్యోగి మరణిస్తే దహన సంస్కారాల కోసం రూ. 25 వేలు కూడా ఇవ్వలేదు. గూడూరు సబ్ డివిజన్‌లోని కొడుమూరు ఆపరేషన్ సెక్షన్‌లో లైన్‌మెన్‌గా పనిచేసి 2022 జూన్ 30న పదవీ విరమణ చేసిన ఎస్.మాసంవలి విద్యుత్ శాఖ విభజన తర్వాత నియమితులైనందున గ్రాట్యూటీ చట్టం 1972 ప్రకారం ఇపిఎఫ్ పెన్షన్‌కు అర్హులు. అయితే, రిటైర్ అయి మూడేళ్లు గడుస్తున్నా ఆయనకు ఇంకా పెన్షన్ మంజూరు కాలేదు. బతికుండగానే చనిపోయినట్లు రికార్డులు సృష్టించి పెన్షన్ నిలిపివేశారు. బాధితులు సూపరింటెండింగ్ ఇంజనీర్‌ను కలిసినా ఫలితం లేకపోవడంతో ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఏ సమస్య వచ్చినా తక్షణమే స్పందిస్తారని భావించిన ఉద్యోగులకు ఇలాంటి జాప్యం నిరాశ కలిగిస్తోంది. జిల్లాలో ఇలాంటి అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, ఎస్ఇ ప్రతి ఎడిఎం సెక్షన్‌ను తనిఖీ చేస్తే వాస్తవాలు తెలుస్తాయని ఉద్యోగ సంఘాల నాయకులు సూచిస్తున్నారు.

వేధింపుల పర్వం: ఆళ్లగడ్డ సబ్ డివిజన్‌లో జూనియర్ లైన్‌మెన్, అసిస్టెంట్ లైన్‌మెన్ , లైన్‌మెన్‌లుగా పనిచేస్తున్న ముగ్గురు శ్రీనివాసులు విషయంలో గందరగోళం నెలకొంది. విధులకు హాజరుకాని జూనియర్ లైన్‌మెన్ , లైన్‌మెన్‌లకు ఇచ్చిన మెమోలను రెగ్యులర్ డ్యూటీ చేస్తున్న అసిస్టెంట్ లైన్‌మెన్ శ్రీనివాసులు సర్వీస్ రిజిస్టర్‌లో నమోదు చేశారు. మరోవైపు, ఎమ్మిగనూరు సబ్ స్టేషన్‌లో ఆపరేటర్‌గా రాఘవేంద్ర పనిచేస్తుండగా, ఎర్రబాడు సబ్ స్టేషన్‌లో నరసింహులు ఆపరేటర్‌గా ఉన్నారు. నరసింహులు డ్యూటీకి రాకపోయినా ఆయనకు పూర్తి జీతం చెల్లించి, ఎమ్మిగనూరులో పనిచేస్తున్న రాఘవేంద్ర జీతం కట్ చేయడం అన్యాయమని ఉద్యోగులు అంటున్నారు.

కార్మికుల సమస్యలపై సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎం. ఉమాపతిని ప్రశ్నిస్తే, ఆయన సమస్యలు అడిగిన ఉద్యోగులు పనిచేస్తున్న గ్రామాల్లో తనిఖీలు చేయించడం, ఇతర అధికారులతో తనిఖీలు చేయించడం, బెదిరించడం, కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. మంత్రాలయం సబ్ డివిజన్‌లో కార్మికులు తమ సమస్యలు పరిష్కరించమని కోరితే, అక్కడి అధికారులు 32 మంది కార్మికులకు ఒక్కొక్కరికి 10 రోజుల జీతం కట్ చేశారు. ఇలాంటి కక్ష సాధింపులకు పాల్పడుతున్న అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈలాంటి చర్యలకు వ్యతిరేకంగా కార్మికులను సంఘటితం చేసి మరిన్ని పోరాటాలు చేస్తామని వారు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. అంజిబాబు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు), ఎపిఎస్‌పిడిసిఎల్ కంపెనీ కమిటీ ఉపాధ్యక్షులు పి.నాగరాజులు మాట్లాడుతూ, ఇలాంటి నిర్లక్ష్యపూరితమైన అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

పోషకాహారం అందించడమే లక్ష్యం

- జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పిల్లలు, మహిళలకు ఆరోగ్యకరమైన పోషకాహారం అందించడమే పోషణ్ పక్వాడ లక్ష్యం అని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య తెలిపారు.. మంగళవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో జిల్లా స్థాయి పోషణ పక్వాడ కార్యక్రమని నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు , ముఖ్యంగా గర్భవతులు, పాలిచ్చే తల్లులు వారి ఆరోగ్యం పట్ల వహించాల్సిన శ్రద్ధ, ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన సరైన చర్యలు గురించి అవగాహన కల్పించడమే పోషణ పక్వాడ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. జిల్లా, మండల స్థాయిలో ఈ కార్యక్రమాలను మరింత ఎక్కువగా నిర్వహించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. గర్భవతులు రక్తహీనతకు గురి కాకుండా అవసరమైతే ఐరన్ ఫోలిక్ యాసిడ్‌ను సప్లిమెంట్‌గా తీసుకోవాలన్నారు. అదే విధంగా ట్రైమెస్టర్‌లో తీసుకోవాల్సిన ఇంజెక్షన్ సరైన సమయానికి చేయించుకోవాలన్నారు... డెలివరీ అయిన తర్వాత 3 నెలల వరకు పిల్లలకు తల్లి పాలు ఇవ్వాలని, సంవత్సరం లోపల ఉండే పిల్లలకు ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన విషయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మూడేళ్ల పాటు పిల్లల గురించి వారికి ఇవ్వాల్సిన న్యూట్రీషన్ల గురించి అవగాహన ఉండాలన్నారు. పిల్లలకు జంక్‌ఫుడ్ లాంటివి అలవాటు చేయకుండా చిరుధాన్యాల ద్వారా ఆరోగ్యకరమైన ఆహారం చేసి పిల్లలకి పెట్టాలన్నారు... రాష్ట్ర ప్రభుత్వం గర్భవతులకు పోషన్ ట్రాకర్ ద్వారా టేక్ హోమ్ రేషన్ కిట్లను కూడా ఉన్నారన్నారు. ఐసిడిఎస్ కర్నూలు ఆర్‌జెడి రోహిణి మాట్లాడుతూ తల్లులు తమ పిల్లలని శక్తి వంతులుగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. గర్భవతులు ఆహార నియమాలను పాటిస్తూ అంగన్వాడి కేంద్ర ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. అంతకుముందు మిల్లెట్‌లతో తయారు చేసిన పౌష్టిక ఆహార పదార్థాల ప్రదర్శన స్టాల్స్‌ను జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. అనంతరం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గర్భిణీలకు సామూహిక సీమంతాల కార్యక్రమాలను నిర్వహించారు. ఐసిడిఎస్ పిడి నిర్మల, డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, డిఎంహెచ్ఓ శాంతకళ, సిడిపిఓలు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామానికి చెందిన బోయ మునిగోల్ల సులోచనమ్మ రూ.2,40,000 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మంగళవారం టిడిపి నందికొట్కూరు నియోజకవర్గ ఇన్చార్జి సీనియర్ నాయకులు గౌరవ వెంకటరెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల సీనియర్ నాయకులు విశ్వేశ్వర్ రెడ్డి నన్నూరు గ్రామ నాయకులు టి.విజయుడు మాజీ కోఆప్షన్ మెంబర్ శంషుద్దీన్ తదితరులు ఉన్నారు.

బాధితురాలికి చెక్కును అందజేస్తున్న నాయకులు

బీసీలకు సబ్సిడీ రుణాలు అందేనా..?

- ఆశ బారెడు- లబ్ధిదారులు చారేడు - దరఖాస్తు చేసుకున్న 5716 మంది - కేవలం 191 మందికి మాత్రమే రుణాలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగర జనాభా సుమారు ఏడు లక్షలు ఉంటే అందులోబిసిలు 50 శాతం ఉన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం బిసి కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేసింది. అందుకు బిసిలలో అర్హులైన వారందరూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఫిబ్రవరి మొదటి నుండి ఈ వ్యవహారం నడిచింది. అయితే 24, 25 తేదీల్లో కర్నూల్ నగరపాలక సంస్థ కొత్త కౌన్సిల్ హాల్‌లో దరఖాస్తు చేసుకున్న 5716 మంది లో అర్హులైన వారిని గుర్తించి 24, 25 తేదీలలో కర్నూల్ నగరపాలక సంస్థ కొత్త కౌన్సిల్ హాల్ లో వివిధ బ్యాంకర్ల సమక్షంలో దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమాన్ని టిపిఆర్ఓ వెంకట్ లక్ష్మి పర్యవేక్షించారు. వివిధ బ్యాంకులు 11బ్రాంచీల నుండి మొత్తం 191 మందిని ఎంపిక చేసి రుణాలు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించడంతో అధికారులు ఏం చేయాలో తోచక అయోమయంలో పడ్డారు. ప్రభుత్వం 50శాతం సబ్సిడీ తో రుణాలు ఇస్తామనడంతో బీసీల్లో ఉన్న అర్హులైన వారందరూ దరఖాస్తు చేసుకున్నారు. దీనితో కొత్త కౌన్సిల్ హాల్ వద్ద జనంతో రద్దీగా తయారైంది. రుణాలు వచ్చేది దేవుడు ఎరుగు కానీ ఈ కారణం చేత జిరాక్స్ సెంటర్లో కిక్కిరిసిపోయాయి. బ్యాంకర్లు కేవలం దరఖాస్తు ఫారం బ్యాంక్ పుస్తకం మాత్రమే తీసుకురావాలని చెప్పినప్పటికీ దరఖాస్తు చేసుకున్న వారు దరఖాస్తుతో పాటు ఫొటో, ఆధార్, రేషన్ కార్డు, క్యాస్ట్, బ్యాంక్ జిరాక్స్ సర్టిఫికెట్లతో హాజరయ్యారు. దీనితో బ్యాంక్ అధికారులు లబ్ధిదారులకు సచివాలయం ద్వారా అర్హులైన వారిని గుర్తించి వారికి మాత్రమే వాట్సప్‌లో సమాచారాన్ని పంపించారు. అంతేకాకుండా అధికార పార్టీ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్ల పేర్ల రికమండేషన్ లతో సబ్సిడీ రుణాలు పొందాలని లబ్ధిదారులు వారి చుట్టూ కూడా తిరగారు. దరఖాస్తు చేసుకున్న వారి సమాచారం ఆన్‌లైన్ చేసుకొని ఉంచుకొని వచ్చే ఆర్థిక సంవత్సరంలో రుణాలు ఇచ్చే సమయంలో వాటిని సద్వినియోగం చేసుకునేందుకు బ్యాంకర్లు సిద్ధమయ్యారు.

నిరాశే మిగిలింది

- సి.జయమ్మ, పాతబస్తీ.

ప్రభుత్వం సబ్సిడీ రుణాలు ఇస్తానంటే ఆశతో దరఖాస్తు చేసుకున్న. టైలరింగ్ మిషన్లు తెచ్చుకొని ఇతరులకు సహాయం చేస్తూ ఇతరులకు సహాయం చేస్తూ బతకాలనుకున్న. కానీ మంత్రులు, ఎమ్మెల్యేలు చెప్పిన వారికే బ్యాంకు రుణాలు అన్నారు. అర్హులైన మాలాంటి వారికి రుణాలు అందడం లేదు. మహిళలను లక్షాధికారులను చేస్తానంటూ ప్రభుత్వాలు చెప్పడం తప్ప ఆచరణలో సాధ్యం కావడం లేదు. బిసి కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు ఇస్తానంటే చాలా మంది నాలాగా దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం నుండి విధులు మంజూరు కావడం లేదు. నాలాంటి వారికి రుణాలు అందడం లేదు.

అర్హులందరికీ సబ్సిడీ రుణాలివ్వాలి

- రజక సంఘం న్యూ సిటీ కార్యదర్శి శేషాద్రి, లక్ష్మీ నగర్.

కర్నూల్ నగర జనాభాలో 50 శాతం మంది బిసిలు ఉన్నారు. వీరిలో బిసి కార్పొరేషన్ ద్వారా లరుణాలకు దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య 5716 మంది అయితే 191 మందికి మాత్రమే రుణాలు మంజూరు చేస్తామనడం చాలా దారుణం. ప్రభుత్వం బిసి కార్పొరేషన్లకు నిధులు ఎక్కువ కేటాయించి బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి ఆదుకోవాలి. బిసిలలో చేతివృత్తులు చేసుకునేవారు కూడా ఉన్నారు. వారిలో రజకులు 5000 మంది దాకా ఉన్నారు. ప్రతి ఒక్కరూ రజక వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. వారికి ప్రభుత్వం రజక కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు ఇచ్చి వారి వృత్తులను ప్రోత్సహించి రాజకీయ నాయకులను, అధికారులను వారి దర్జాను పెంచే విధంగా బట్టలు ఉతికించేలా కృషి చేయాలి. కేవలం అధికార పార్టీ వెంట తిరిగేవారికి మాత్రమే ఈ రుణాలు అధికారులు ఇచ్చేలాగా వ్యవహరిస్తున్నారు. దీనితో అర్హులైన వారికి ఈ రుణాలు అందడం లేదు.

హత్యాయత్నం కేసులో నిందితులు అరెస్ట్

కర్నూలు డిస్‌పి జె.బాబు ప్రసాద్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

టిడిపి కార్యకర్తపై హత్యాయత్నానికి పాల్పడిన వైసిపికి చెందిన నలుగురు నిందితులను అరెస్టు చేశామని కర్నూలు డిఎస్‌పి జె బాబు ప్రసాద్ అన్నారు. మంగళవారం కర్నూలు డిఎస్‌పి కార్యాలయంలో కర్నూల్ ఫోర్త్ టౌన్ సిఐ మధుసూదన్ గౌడ్ తో కలిసి కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు. డిఎస్‌పి కథనం మేరకు.. ఈనెల 13న సాయంత్రం ఏడు గంటల సమయంలో కల్లూరు మండలం, డిమార్ట్ వెనకాల టిడిపి ఆఫీస్ మీద దాడి చేసి అందులో ఉన్న కర్నూలు నగరం బృందావన కాలనీకి చెందిన శేఖర్ గౌడ్ అనే వ్యక్తిపై, మరి కొంతమందిపై వైసిపికి చెందిన భూపని ప్రభాకర్ నాయుడు, కాశి ఏ కాశి బాబు, రహంతుల్లా, పటన్ సలాం ఖాన్ వేట కొడవళ్ళు, కత్తులతో హత్యాయత్నానికి పాల్పడ్డారు. శేఖర్ గౌడ్ తండ్రి భూషణ్ గౌడ్ ఫిర్యాదు మేరకు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్లో క్రైమ్ నెంబర్ 127/2025 గా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సదరు నిందితులను మంగళవారం ఉదయం 9 గంటల సమయంలో కర్నూలు ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలో అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి కత్తులను వేట కొడవల్లను స్వాధీనం చేసుకొని కోర్టు వారి ఎదుట హాజరు పరిచారు.కర్నూలు ఫోర్త్ టౌన్ ఎస్ఐ చంద్ర శేఖర్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

రీ సర్వేపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-మద్దికేర

మండల కేంద్రమైన మద్దికేర సచివాలయం 3లో రైతులకు రీ సర్వేపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు తహ శీల్దార్ హుస్సేన్ సాహెబ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రీ సర్వేతో గ్రామాలలో ఎన్నో దశాబ్దాల నుంచి ఉన్న సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. రైతులు దగ్గరుండి తమ భూములను సర్వే చేయించుకోవాలని పేర్కొన్నారు. తమ భూమికి సంబంధించిన పత్రాలు అధికారులకు అందజేస్తే భూమిని కొలిచి హద్దులు నిర్ణయిస్తారని తెలిపారు. భూముల రీ సర్వే పై గ్రామాలలో విస్తృతంగా ప్రచారం నిర్వహించి రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు తహశీల్దార్ సూచించారు. ఆర్ఐ రామదాసు, విఆర్ఓ హర్షవర్ధన్, రైతులు పాల్గొన్నారు.

లస్కర్లను రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఇరిగేషన్ ప్రాజెక్టుల కింద పనిచేస్తున్న లస్కర్లను వెంటనే రెగ్యులర్ చేయాలని ఔట్‌సోర్సింగ్ లస్కర్స్ సంఘం అధ్యక్షుడు నాగన్న డిమాండ్ చేశారు. మంగళవారం కర్నూలు నగరంలోని స్థానిక జలమండలి కార్యాలయం నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం గాంధీ విగ్రహం సమీపంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షులు జి.నాగన్న మాట్లాడుతూ జీవో వచ్చి 40 సంవత్సరాలు అయినా నేటికీ అమలు కాకపోవడం దురదృష్టమని వాపోయారు. జీవో ఇచ్చింది ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు ప్రభుత్వం అన్నారు. అన్ని ప్రభుత్వాలు తమను మోసం చేశాయని, తెలుగుదేశం ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తమకు న్యాయం చేస్తారని జీవో అమలు చేసి పర్మినెంట్ ఉద్యోగాలు ఇచ్చి మా కుటుంబాలను ఆదుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పర్మినెంట్ ఉద్యోగఅవకాశాలు కల్పించి న్యాయం చేస్తారని ఆశిస్తున్నామన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిఆర్ఓ కు అందజేశారు. ఈ ర్యాలీకి డివిజన్ల నుంచి లస్కర్లు తరలివచ్చి జయప్రదం చేయడం పట్ల అధ్యక్షులు నాగన్న ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అక్షయ్, రంగస్వామి,గౌస్, మనోహర్, చెన్నయ్య, హుస్సేనయ్య, రఘురాం రెడ్డి, చెంచిరెడ్డి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఉపాధి పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి నాగన్న, మండల నాయకులు రామస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం ఓర్వకల్లు మండలంలోని లొద్దిపల్లి గ్రామంలో ఉపాధి పనులను వారు పరిశీలన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఓర్వకల్ పర్యటనకు వచ్చిన సందర్భంలో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఉపాధి పెండింగ్ బిల్లులు త్వరలో ఇస్తామని ప్రకటించారన్నారు. ఇప్పటివరకు పెండింగ్ బిల్లులు విడుదల కాలేదని పేర్కొన్నారు. ఉపాధి కూలీలకు పని ప్రదేశాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ మహేష్ , ఉపాధి కూలీలు నాగరాజు, లక్ష్మీదేవి, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

పౌరాణిక నాటకానికి ఆద్యుడు కందుకూరి

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్

కందుకూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న బిసీ రాజారెడ్డి

పౌరాణిక నాటకానికి శ్రీకారం చుట్టిన వ్యక్తి కందుకూరి వీరేశలింగం పంతులు అని మాజీ రాజ్యసభ సభ్యులు టిజి.వెంకటేష్, అరుణ భారతి అధ్యక్షులు బిసి రాజారెడ్డి తెలిపారు. మంగళవారం రాత్రి స్థానిక టిజివి కళాక్షేత్రంలో పేర్లు కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి సభ నిర్వహించారు. అంతకుముందు కందుకూరి చిత్రపటానికి బీసీ రాజారెడ్డి, ఆకుల లక్ష్మణ్, డాక్టర్ శంకర్ శర్మ జ్యోతి ప్రజ్వలనం చేసి పుష్పమాల వేశారు. టిజి.వెంకటేష్ మాట్లాడుతూ ఈనెల 20 నుంచి వారం రోజుల పాటు టీజీవి కళాక్షేత్రంలో మాట ,పాట,పద్యం ,ఆట వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. అరుణ భారతి అధ్యక్షులు బీసీ రాజారెడ్డి మాట్లాడుతూ చల్లా నవీన్ కుమార్ హరిశ్చంద్ర పాత్రను చక్కగా పోషించారని అన్నారు. ఇలాంటి నటులు నాటక రంగానికి అవసరమన్నారు. అనంతరం సంగీత గురువులు వెంకటేశ్వర్లు, ఎం.రాజశేఖర్ రాజు, లక్ష్మన్న, కేశవులు, ధనుంజయ, పి.రామలింగయ్య, ఎం.రామకృష్ణారెడ్డి, జె మహేశ్వరయ్య, బందేగౌడ, బలరాం నాయుడుతో పాటు కళాకారులు చల్ల నరసింహనాయుడు కెపి నాగప్పను సత్కరించారు. పత్తి ఓబులయ్య స్వాగతం పలుకుతూ మొదటిసారి ఇద్దరూ నూతన నటులను వేదికకు పరిచయం చేసే ఘనత కళాక్షేత్రాన్ని దక్కిందన్నారు. అదేవిధంగా మొత్తం ఐదు కందుకూరి అవార్డులు టిజివి కళాక్షేత్రం సభ్యులకు రావడం సంతోషమన్నారు. అంతకుముందు చల్లా నవీన్ కుమార్ ఎంఆర్ రాధిక సత్య హరిశచంద్ర కాటిసీను అదేవిధంగా కెవి రమణ జీవీ శ్రీనివాసరెడ్డి కే బాల వెంకటేశ్వర్లు శ్రీకృష్ణ రాయబారం లోని ఒక సన్నివేశాన్ని ప్రదర్శించారు. సంగా ఆంజనేయులు పి. రాజారత్నం వాల్మీకి రాముడు, ఇనాయతుల్లా పాల్గొన్నారు.

టిఐఎస్ గడువు పెంచాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

ఉపాధ్యాయుల ప్రమోషన్ , బదిలీలకు సంబంధించి, టిఐఎస్‌లో నమోదుకు గడువు పెంచాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవికుమార్ నవీన్‌పాటి డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్‌పాల్‌కు యుటిఎఫ్ జిల్లా కమిటీ ప్రతినిధి బృందం కలిసి వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవికుమార్, నవీన్‌పాటి మాట్లాడుతూ టిఐఎస్ లో ఉపాధ్యాయుల వివరాలను నమోదుకు సంబంధించిన గడువు మరో నాలుగు రోజులకు పెంచితే ఎలాంటి ఇబ్బందులు ఉండవు అన్నారు. భవిష్యత్తులో విద్యాశాఖ చేపట్టే బదిలీలు పదోన్నతులలో ఎలాంటి పొరపాట్లు జరగవని అన్నారు. వివరాల ను సరి చేసేందుకు ఎంఇఒ లు ,హెచ్‌ఎంలకు అవకాశం కల్పించాలని డిఇఒను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహా అధ్యక్షుడు హేమంత్ కుమార్ , జిల్లా కార్యదర్శి తిమ్మన్న సీనియర్ నాయకులు రాములు, వేణుగోపాల్, సుధాకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కెజిబివి విద్యార్థినికి అభినందన

గూడూరు కెజిబివి పాఠశాలకు చెందిన విద్యార్థిని సునీత 983 మార్కులు సాధించడంతో సోమవారం డిఇఒ ఎస్ శామ్యూల్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కెజిబివి ప్రిన్సిపల్ జరీనా, యుటిఎఫ్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

వాట్సప్ గవర్నెన్స్ సేవలు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా అందజేస్తున్న వాట్సప్ గవర్నెన్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్నటువంటి పలు రకాల సేవలను నేరుగా ప్రజలు తమ వాట్సాప్ ద్వారా 9552300009 నంబరుకు నేరుగా ఈ సేవలను వినియోగించుకోవాలని ఆయన కోరారు.

శిక్షణ ముగిసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్ననిర్వాహకులు

ముగిసిన వృత్తివిద్య విద్యార్థుల ఇంటర్న్‌షిప్

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

పదవ తరగతి వృత్తి విద్యార్థుల (ఐటిఐటిఇఎస్) కోసం పది రోజుల పాటు నిర్వహించిన ఇంటర్న్‌షిప్ కార్యక్రమం ముగిసిందని ఉలిందకొండ పాఠశాల హెచ్‌ఎం లీలావతి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులు తమ నైపుణ్యాలను, వారి ప్రాజెక్టులను ప్రదర్శించారు. విద్యార్థుల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేసి, వారి విజయాన్ని అభినందిస్తూ, సాంకేతికత పట్ల వారి మక్కువను కొనసాగించమని ప్రోత్సహించారు. ఇంటర్న్‌షిప్ వల్ల ఐటి రంగంలో భవిష్యత్తులో మంచి ఉద్యోగ అవకాశాలు ఉంటాయని ఒకేషనల్ ట్రైనర్‌రెడ్డిపోగు మోజస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఛైర్మన్ కోసం బలపరీక్ష

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

ప్రజాశక్తి - ఆదోని

మున్సిపల్ ఛైర్మన్ శాంతపై బుధవారం అవిశ్వాస తీర్మానంపై ప్రత్యేక సమావేశానికి అన్ని ఏర్పాట్లూ చేశారు. బలపరీక్ష నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లూ చేశారు. వైసిపి ఇప్పటికే ఆ పార్టీ గుర్తుపై గెలిచిన కౌన్సిలర్లు అందరికీ విప్ జారీ చేసింది. జారీ చేసిన విప్ ధ్రువీకరణ పత్రాలను ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు సమర్పించామని మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు బాలాజీ, సందీప్ రెడ్డి తెలిపారు. విప్ నిబంధనలకు అనుగుణంగా సభ్యులు ఓటు కోసం చేయి ఎత్తాల్సి ఉందని పరిశీలకులు అంటున్నారు. ఇటీవల బిజెపిలో చేరిన 12వ వార్డు కౌన్సిలర్ వసీం మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి సమక్షంలో వైసిపిలో చేరారు. వైసిపికి ఛైర్మన్ శాంత మినహా 35 మంది సభ్యుల బలం ఉంది. ఛైర్మన్ అవిశ్వాస తీర్మానం నెగ్గేందుకు తమకు కావాల్సిన మ్యాజిక్ ఫిగర్ కన్నా అధికంగా మెజార్టీ ఉందని వైసిపి నాయకులు చెబుతున్నారు. బిజెపి నాయకులు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని, వైసిపి కౌన్సిలర్ల కాలర్ పట్టుకోవాలని వాహనాల మీద నిలిచి ప్రజలకు వివరిస్తున్నారని, దీనివల్ల బలపరీక్ష సందర్భంగా ఏదైనా ఘటన జరిగే అవకాశం ఉందని వైసిపి కౌన్సిలర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు నిర్వహించాలని డీఎస్పీ హేమలతకు వైసిపి నాయకులు, కౌన్సిలర్లు వినతిపత్రం ఇచ్చారు. అనుమతి లేకుండా వాహనాలతో వార్డుల్లో ప్రచారం నిర్వహించిన బిజెపి నాయకులపై చర్యలు తీసుకోవాలని డీఎస్పీని కోరారు. స్పందించిన ఆమె సోషల్ మీడియాలో ప్రచారమైన దృశ్యాలను చూసి పాల్గొన్న వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నేడు జరగబోయే బలపరీక్ష ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని డీఎస్పీ హేమలతను ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, వైసిపి సీనియర్ నాయకులు చంద్రకాంత్ రెడ్డి, వైస్ ఛైర్మన్ నరసింహులుతో పాటు కౌన్సిలర్లు సందీప్ రెడ్డి, బాలాజీ, ఫయాజ్ అహ్మద్ మర్యాదపూర్వకంగా కలిశారు.

సబ్ కలెక్టర్‌కు విప్ పత్రాలను ఇస్తున్న వైసిపి కౌన్సిలర్లు

మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి ఏర్పాట్లు పూర్తి

మున్సిపల్ కౌన్సిల్ హాలులో 10.30 గంటలకు ప్రిసైడింగ్ ఆఫీసర్ వారితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ కృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి ప్రతి కౌన్సిలర్ మున్సిపల్ కమిషనర్‌తో జారీ చేసిన గుర్తింపు కార్డుతో బుధవారం ఉదయం 10.30 గంటల్లోపు అరగంట ముందుగా హాజరు కావాలన్నారు. కేవలం వార్డు కౌన్సిలర్‌కు మాత్రమే గేటు-1లో ప్రవేశం ఉంటుందని, ఎవరికీ అనుమతి ఉండబోదని తెలిపారు.

నిర్మలను సన్మానిస్తున్న జెసి నవ్య

జిల్లా టాపర్ నిర్మలకు సన్మానం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో జిల్లా టాపర్‌గా నిలిచిన పెద్దహరివాణం గ్రామానికి చెందిన ఎస్.నిర్మలను మంగళవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. జెసి డాక్టర్ బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, రాష్ట్ర కురువ కార్పొరేషన్ ఛైర్మన్ దేవేంద్రప్ప నిర్మలకు శాలువా కప్పి, పూలమాల వేసి సన్మానించారు. ఆస్పరి మండలం కెజిబివి కళాశాలలో బైపిసి గ్రూపు చదువుతున్న నిర్మల మొదటి సంవత్సరం 421 మార్కులు, ద్వితీయ సంవత్సరం 966/1000 మార్కులు సాధించి, జిల్లాలో బైపిసి గ్రూపులో అత్యుత్తమ స్థాయిలో ప్రదర్శన చూపారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సమర్థంగా వినియోగించుకుని, నిర్మల వంటి విద్యార్థులు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నిర్మల మాట్లాడుతూ... ఐపిఎస్ కావడమే తన లక్ష్యమని వెల్లడించారు. పలువురు ఆమెను అభినందించారు.

పట్టుబడిన వాహనాలకు వేలం

ప్రజాశక్తి - ఆదోని

వేలం నిర్వహిస్తున్న సిఐ

అక్రమ మద్యం, నాటు సారా రవాణా కేసుల్లో పట్టుబడిన వాహనాలకు వేలం నిర్వహించామని ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ సైదుల్ తెలిపారు. మంగళ వారం స్టేషన్ ఆవరణలో వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కర్నూలు ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిసి ఆదేశాల మేరకు కర్నూలు ఎఇఎస్ రామకృష్ణా రెడ్డి ఆధ్వర్యంలో వివిధ కేసుల్లో పట్టుబడిన 30 వాహనాల్లో 28 వాహనాలను కొనుగోలు దారులు పాట పాడినట్లు తెలిపారు. మిగిలిన 2 వాహనాలు అధిక ధరల వల్ల మిగిలి పోయాయన్నారు. ఇందులో భాగంగా 28 వాహనాలకు గాను వేలం పాటలో రూ.1,86,600, వాటికి సంబంధించిన జిఎస్‌టి రూ.33,588 మొత్తం కలిపి రూ.2,20,188 ప్రభుత్వ ఖజానాకు జమ అయినట్లు వివరించారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - కౌతాళం

వైద్య శిబిరంలో పాల్గొన్న ప్రజలు

శ్రీమహంతేశ్వర స్వామి మఠం ఆరాధనోత్సవాల సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మండలంలోని హాల్వి గ్రామంలో వెలిసిన శ్రీమహాదేశ్వర స్వామి ఆధ్వర్యంలో 18 రోజులు పురాణం కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. పురాణం ముగింపు సందర్భంగా మఠం పీఠాధిపతులు మహంతేశ్వర స్వామి ఆధ్వర్యంలో వైసిపి మండల ఉపాధ్యక్షులు చెన్నప్ప, ఉప సర్పంచి బసవ ప్రభు సహకారంతో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో కంటి, గుండె జబ్బు పరీక్షలు, మధుమేహం, బిపి, కీళ్ల నొప్పులు తదితర వ్యాధులకు వైద్యులు పరీక్షలు నిర్వహించారు. హాల్వి గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూడా వైద్య శిబిరానికి తరలివచ్చి చూపించుకున్నారు. ఇలాంటి సామాజిక సేవలు గ్రామస్తులకు ఎంతో ఉపయోగపడతాయని పీఠాధిపతులు పేర్కొన్నారు. గ్రామస్తుల ఆరోగ్యం ముఖ్యమని, శిబిరం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

ప్రజల భాగస్వామ్యంతో పరిశుభ్రత

- కమిషనర్ గంగిరెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

పరిసరాల పరిశుభ్రత ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమని మున్సిపల్ కమిషనర్ ఎన్.గంగిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని పార్కు రోడ్డు, షరాఫ్ బజార్, కొండవీటి ప్రాంతంలో పారిశుధ్య పనులు పరిశీలించారు. పట్టణంలోని శ్రీనివాస సర్కిల్‌లో గల అన్న క్యాంటీన్‌లో అల్పాహారం పంపిణీని తనిఖీ చేశారు.

నేటి నుంచి భంభం బాబా ఉరుసు మహోత్సవాలు

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరిలో భంభం బాబా (సయ్యద్ షా సుల్తాన్ మోహిద్దీన్ ఖాద్రీ) 116వ ఉరుసు మహోత్సవాలు బుధవారం నుంచి నిర్వహిస్తున్నట్లు పీఠాధిపతులు డాక్టర్ సయ్యద్ అరిఫుద్దీన్ ఖాద్రీ మంగళవారం తెలిపారు. 16న గంధం, 17న ఉరుసు కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు భంభం బాబా ఉరుసులో పాల్గొంటారని తెలిపారు. ఈ ఉరుసుకు సంబంధించిన ఏర్పాట్లను ఖాద్రీ వంశీయులు ఇప్పటికే పూర్తి చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం విద్యుత్ వసతి, తాగునీరు సౌకర్యాలు కల్పించారు. భంభం బాబా భక్తుల కోసం ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని రెండు రోజులపాటు నిర్వహిస్తున్నారు. దర్గా ఆవరణలో భక్తులను అలరించడానికి కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. మూడు రోజులపాటు నిర్వహించే భంభం బాబా ఉరుసు మహోత్సవాల్లో వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 50 వేల మంది భక్తులు పాల్గొంటారని అంచనా. దీనికి తగ్గట్టు భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.

దర్గాలోని భంభం బాబా స్వామి సమాధులు


చిప్పగిరిలో వెలసిన భంభం బాబా దర్గా

ఆర్థిక సాయం అందజేస్తున్న ప్రధానోపాధ్యాయులు

జాతీయ స్థాయి క్రీడాకారిణికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - మంత్రాలయం

జాతీయ స్థాయి క్రీడాకారిణి ముస్కాన్‌కు పాఠశాల నుంచి రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు హంపయ్య చేతులమీదుగా ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈనెల 21న మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో జరగనున్న 14వ జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. క్రీడాకారిణిని ప్రోత్సహిస్తూ ఇటీవల వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డి రూ.10 వేలు, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారని చెప్పారు. ఈ నేపథ్యంలో రవాణా ఖర్చులకు ఇచ్చేందుకు తండ్రికి ఆర్థిక స్థోమత లేనందున పాఠశాల తెలుగు సబ్జెక్టు సహ ఉపాధ్యాయులు రామన్న అభ్యర్థన మేరకు ఆయన మిత్రులు కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరులోని ఐకాన్ ఇంజినీరింగ్ మేనేజింగ్ డైరెక్టర్ నూరుల్లా రూ.5 వేల నగదుతో పాటు ట్రావెలింగ్ బ్యాగు అందజేసినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు విటోబా రావు, చంద్రశేఖర్, రామన్న, బసవరాజు, నరసింహరాజులు పాల్గొన్నారు.

ఆదోనిలో రాజకీయ ఉత్కంఠ

- నేడు మున్సిపల్ ఛైర్మన్...
- త్వరలోనే ఎంపిపిపై అవిశ్వాస తీర్మానం..?

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని నియోజకవర్గంలో రాజకీయంగా ఉత్కంఠ నెలకొంది. బుధవారం మున్సిపల్ ఛైర్మన్ శాంతపై అవిశ్వాస తీర్మానం పెట్టనున్నారు. అలాగే త్వరలోనే ఎంపిపిపై కూడా అవిశ్వాస తీర్మానం పెట్టనున్నట్లు తెలిసింది.

గత వైసిపి ప్రభుత్వంలో ఆదోని మున్సిపల్ ఛైర్మన్‌గా శాంత, ఆదోని ఎంపిపిగా దానమ్మ బాధ్యతలు చేపట్టారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాజకీయాలు మారిపోయాయి. వైసిపి నుంచి గెలిచిన మున్సిపల్ ఛైర్మన్ శాంత భర్త సింహం నాగేంద్ర బిజెపిలో చేరడంతో వైసిపి కౌన్సిలర్లు పనులను అడ్డగిస్తున్నారనే నెపంతో సొంత పార్టీ నేతలే అవిశ్వాస తీర్మానం చేపట్టారు. బుధవారం అవిశ్వాస తీర్మానంపై ఆదోని మున్సిపల్ 10.30 గంటలకు వైసిపి కౌన్సిలర్లు బలపరీక్ష చూపిస్తున్నారు. మరోపక్క వైసిపి నుంచి గెలుపొందిన ఆదోని ఎంపిపి దానమ్మ బిజెపి తీర్థం పుచ్చుకున్నారు. త్వరలో ఆమెపై కూడా అవిశ్వాస తీర్మానం పెడుతున్నట్లు మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి ప్రకటించారు. వైసిపి ఎంపిటిసిల అవిశ్వాసాన్ని, పార్టీ అధిష్టానం నమ్మకాన్ని కోల్పోయిన ఎంపిపి దానమ్మకు ఆ పదవిలో ఉండే అర్హత లేదని, చట్టం ప్రకారం అవిశ్వాస తీర్మాన్ని త్వరలోనే పెడతామని వివరించారు. సెప్టెంబర్ 23తో నాలుగు సంవత్సరాలు పూర్తి కావడంతో సెప్టెంబర్ 24 తర్వాత అవిశ్వాస తీర్మానం చేపడుతున్నట్లు తెలిపారు. ఆదోని మండలంలో 27 మంది ఎంపిటిసిలు ఉండగా, ఎంపిపి దానమ్మ బిజెపి తీర్థం పుచ్చుకోగా, ఇద్దరు ఎంపిటిసిలు మృతి చెందారు. 24 మంది ఎంపిటిసిలు, ఒకరు కో ఆప్షన్ సభ్యులు ఉన్నారు. వైస్ ఎంపిపిలుగా నాగనాథనహళ్లి ఎంపిటిసి నరేందర్ రెడ్డి, పెద్ద హరివాణం ఎంపిటిసి బంగి పూజారి పుష్పలత ఉన్నారు. అవిశ్వాస తీర్మానంతో వీరిలో ఒకరికి ఎంపిపిగా అయ్యే అవకాశం ఉంది.

మండల పరిషత్ కార్యాలయం

కూలీలతో మాట్లాడుతున్న ఎంపిడిఒ

కొలతల ప్రకారం పనులు

- ఉపాధి పనులను పరిశీలించిన ఎంపిడిఒ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

కొలతల ప్రకారంగా పనులు నిర్వహించాలని ఎంపిడిఒ రాజేంద్రప్రసాద్ తెలిపారు. మంగళవారం మండలంలోని పెద్దతుంబలం, కడితోట గ్రామాల్లో ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన ఉపాధి కూలీలతో మాట్లాడారు. కూలీలకు నష్టం జరగకుండా హాజరు సక్రమంగా వేయాలని తెలిపారు. ఉపాధి హామీ పనులు ప్రజలకు, రైతులకు ఉపయోగపడే విధంగా ఉండాలని, పనుల్లో ఎలాంటి లోటుపాట్లు జరగకుండా చూడాలని వివరించారు.

ఈకేవైసీ తప్పనిసరి

- తహశీల్దార్ శివరాముడు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని రూరల్, అర్బన్ పరిధిలోని రేషన్ కార్డుదారులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఆదోని తహశీల్దార్ శివ రాముడు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం ఆదోని రూరల్, అర్బన్ కలిపి మొత్తం 26,774 మంది రేషన్ కార్డుదారులు ఉన్నారని, వీరిలో కొంతమంది ఇప్పటికే ఈకేవైసీ పూర్తి చేసుకున్నారని తెలిపారు. మిగిలిన లబ్ధిదారులు ఈనెల 30లోపు తప్పనిసరిగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఈకేవైసీ ప్రక్రియను విఆర్‌ఒలు, ఎఫ్‌పి షాప్ డీలర్లు, ఎండియు ఆపరేటర్లు, గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా పూర్తి చేయవచ్చని తెలిపారు. ఈకేవైసీ చేయని కార్డుదారులకు మే నెల నుంచి రేషన్ పంపిణీ నిలిపేసే అవకాశం ఉందని హెచ్చరించారు. లబ్ధిదారులు జాప్యం చేయకుండా వెంటనే సంబంధిత అధికారుల సహాయంతో ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని తెలిపారు.

నేమకల్లు పశువైద్యాధికారిగా కమలమ్మ

ప్రజాశక్తి - చిప్పగిరి

మాట్లాడుతున్న కమలమ్మ

మండలంలోని నేమకల్లు గ్రామ పశు వైద్యాధికారిగా కమలమ్మ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న మహేష్ ఏరూరుకు వెళ్లడంతో ఆమె ఇక్కడ విధుల్లో చేరారు. ఆమె మాట్లాడుతూ... రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. పశువులకు ఏ వ్యాధి వచ్చినా వెంటనే టీకాలు వేస్తామని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులకు రాయితీపై ఏది వచ్చినా వెంటనే సమాచారం ఇచ్చి వచ్చేలా కృషి చేస్తామన్నారు. బర్రెలకు అత్యవసరంగా ఏదైనా సమస్య వచ్చినా పశు వైద్యశాలలకు తీసుకొస్తే వెంటనే టీకాలు వేస్తామన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు : ఎస్ఐ

ప్రజాశక్తి - కోసిగి

మండలంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలు, చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే చర్యలు తప్పవని కోసిగి ఎస్ఐ హనుమంతు రెడ్డి హెచ్చరించారు. మంగళవారం మండలంలోని డిబెళగల్ గ్రామంలో కొత్తగా నిర్మిస్తున్న గ్రామ సచివాలయం ముందు ఖాళీ స్థలంలో గ్రామానికి చెందిన బింగి వెంకటేష్, ఇద్దరు వ్యక్తులు కర్ణాటక మద్యం అమ్ముతుండగా , మట్కా చీటీలు రాస్తుండగా దాడులు చేసి సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. వారి వద్ద ఉన్న 240 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను, రూ.11,500 నగదు, మట్కా చీటీలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్ పంపారు. ఈ కేసులో ఇద్దరు వ్యక్తులు పరారీలో ఉన్నారని ఎస్ఐ తెలిపారు. గ్రామంలో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'మోడల్' ప్రవేశ పరీక్షపై అవగాహన తరగతులు

- ప్రిన్సిపల్ షాహినా పర్వీన్

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని వివిధ పాఠశాలల్లో 5వ తరగతి చదువుతూ ఎపి మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులందరికీ బుధవారం నుంచి అవగాహన తరగతులు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ షాహినా పర్వీన్ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడారు. బుధవారం నుంచి మూడు రోజులపాటు (16, 17, 19వ తేదీల్లో) ఎపి మోడల్ స్కూల్ వద్ద ఉపాధ్యాయులతో అవగాహన తరగతులు నిర్వహించనున్నామని తెలిపారు. ఈ తరగతులు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థి తల్లిదండ్రులు పిల్లల రాకపోకలకు సహకరించి అవగాహన తరగతులకు తమ పిల్లలు హాజరయ్యే విధంగా బాధ్యత తీసుకోవాలని కోరారు.

దొంగతనాలకు అవకాశం ఇవ్వొద్దు : డీఎస్పీ

ప్రజాశక్తి - ఆదోని

దొంగతనాలు జరగకుండా పోలీసులకు ప్రజలు సహకరించాలని ఆదోని డీఎస్పీ హేమలత, టూ టౌన్ సిఐ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. మంగళవారం నిందితుని నుంచి రికవరీ చేసిన బంగారు ఆభరణాలను పోలీసు స్టేషన్‌లో మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వేసవి సెలవులు సమీపిస్తున్నాయని, దానిని దృష్టిలో ఉంచుకుని ప్రయాణాలు చేసే వారు వ్యక్తిగత సమాచారం సమీపంలోని పోలీసు స్టేషన్‌లో అందించాలని తెలిపారు. ఆ నివాస ప్రాంతాలకు పోలీసులను పంపించి గస్తీ నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గత నెల 28న వెంకన్న పేటలో ఓ ఇంట్లోకి చొరబడి మహిళ గొంతుపై కత్తి పెట్టి తాళి, నల్లపూసలు, చైన్ కాజేసి పరారైన నిందితునిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు తెలిపారు. ఈనెల 14న ఆదోని రైల్వే స్టేషన్ ప్రాంగణంలో నిందితుని అదుపులోకి తీసుకుని, బంగారు నగలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితుడు వడ్డే రవికుమార్ పట్టణంలోని వడ్డే గేరిలో నివాసం ఉండేవాడని అన్నారు. చెడు వ్యసనాలకు అలవాటు పడి దొంగతనం చేశాడని తెలిపారు. నిందితునిపై కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం కోర్టులో హాజరు పరుస్తున్నట్లు చెప్పారు. ప్రజలు పరిసర ప్రాంత ప్రధాన కూడళ్లలో, స్వగృహంలో బయట ప్రాంతం కనిపించే విధంగా నిఘా నేత్రాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అలా ఎవరికి వారు వ్యక్తిగత భద్రతను ఏర్పాటు చేసుకుంటే నేరాలను మరింత సులువుగా అరికట్టవచ్చని తెలిపారు. నిఘానేత్రాల విషయంలో ప్రజలు స్వచ్ఛందంగా, సామాజిక బాధ్యతగా ముందుకు రావాలని చెప్పారు. కేసును ఛేదించిన సిఐ రాజశేఖర్ రెడ్డి, పోలీసులు రమేష్, ఆంజనేయులు, సురేష్, రామాంజినేయులును డీఎస్పీ హేమలత అభినందించారు.

మాట్లాడుతున్న డీఎస్పీ, సిఐ

సమగ్రంగా ఇంటింటి వైద్య పరీక్షల సర్వే

- డాక్టర్ శైలేష్ కుమార్

ప్రజాశక్తి - గోనెగండ్ల

గ్రామాల్లో వైద్య సిబ్బంది చేపడుతున్న ఇంటింటి వైద్య పరీక్షలు ఎన్‌సిడిసి సర్వేను సమగ్రంగా నిర్వహించాలని జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శైలేష్ కుమార్ తెలిపారు. మంగళవారం గోనెగండ్లలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైద్య సిబ్బంది పాఠశాలల్లో విద్యార్థులకు నిర్వహించే ఆర్‌బిఎస్‌కె పరీక్షల పురోగతిపై అడిగి తెలుసుకున్నారు. ఎంతమంది విద్యార్థులు ఉన్నారు.. ఎంతమందికి వైద్య పరీక్షలు నిర్వహించారని అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి నిర్వహించే ఎన్‌సిడిసి సర్వే పురోగతి, ఇబ్బందులపైనా వివరాలు తెలుసుకుని సిబ్బందికి తగిన సలహాలు, సూచనలు చేశారు. డాక్టర్ రంగ రవళి, డాక్టర్ కార్తీక్, డైస్ మేనేజర్ ఇర్ఫాన్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ శైలేష్ కుమార్

వైభవంగా శ్రీసుశమీంద్ర తీర్థుల స్వర్ణ రథోత్సవం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్ర స్వామి మఠంలో శ్రీసుశమీంద్ర తీర్థుల స్వర్ణ రథోత్సవం వైభవంగా నిర్వహించారు. మంగళవారం శ్రీసుశమీంద్ర తీర్థ ఆరాధన సందర్భంగా పీఠాధిపతులు సుభుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో ఆయన బృందావనాన్ని నిర్మాల్యం చేసి తులసి అర్చనతో పంచామృతాభిషేకం వంటి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం బృందావనాన్ని వెండి కవచాలతో, పట్టు వస్త్రాలతో, వివిధ రకాల పూల మాలలు వేసి అందంగా అలంకరించారు. స్వామి వారి ఆరాధన సందర్భంగా సాంప్రదాయం ప్రకారం టిటిడి ఎఇఒ మోహన్ రాజు టిటిడి నుంచి శ్రీవారి పట్టు వస్త్రాన్ని తీసుకొచ్చి స్వామివారికి అందజేశారు. స్వామిజీ శేషవస్త్రాన్ని రాఘవేంద్రస్వామి బృందావనం ముందు ఉంచి, పండితుల వేద మంత్రాల మధ్య సమర్పణతో మంగళ హారతులిచ్చారు. అనంతరం శ్రీసుశమీంద్ర తీర్థుల బృందావనానికి శాస్త్రోక్తంగా సమర్పించారు. ఈ సందర్భంగా స్వర్ణ రథంపై శ్రీసుశమీంద్ర తీర్థుల చిత్ర పటాన్ని ఉంచి పీఠాధిపతులు సుభుదేంద్రతీర్థులు మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ శ్రీమఠం ప్రాకారంలో ఘనంగా ఊరేగించారు. ఎఎఒ మాధవ శెట్టి, మేనేజర్లు వెంకటేష్ జోషి, సురేష్ కోనాపూర్, ఆధ్యాత్మిక అభివృద్ధి అధికారి శ్రీపతి ఆచార్, అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహ మూర్తి, సహాయక పిఆర్‌ఒ హొన్నొళ్లి వ్యాసరాజాచార్, ద్వారపాలక అనంతస్వామి, ప్రకాష్ రావు, ఉడిపి పరమేష్ స్వామి, రోగనాథ్ స్వామి పాల్గొన్నారు.


రథోత్సవంలో పాల్గొన్న పీఠాధిపతులు

వైద్య కళాశాలను నిర్మించి.. తరగతులు ప్రారంభించాలి

- జెసికి ఎస్ఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలో ప్రభుత్వ వైద్య కళాశాలను తక్షణమే నిర్మించి, తరగతులను ప్రారంభించాలని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం జెసి డాక్టర్ బి.నవ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు మాట్లాడారు. ఆదోనిలో అర్ధాంతరంగా నిలిచిపోయిన మెడికల్ కళాశాల పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. మెడికల్ కళాశాల పనులు ఆగిపోవడం, ఈ సంవత్సరం నుంచి ప్రారంభం కావాల్సిన తరగతులు ఆగిపోవడంతో ఆదోని ప్రజలు, విద్యార్థులు విమర్శలు చేస్తున్నారని తెలిపారు. ఆదోనిలో ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రారంభిస్తే చుట్టుపక్కల ప్రజలకు మంచి వైద్యం అందుబాటులోకి రావడంతో పాటు ఆదోని రెవెన్యూ డివిజన్‌లోని బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు వైద్య విద్య అందుతుందని చెప్పారు. కేంద్రంతో సంప్రదించి 5 కళాశాలలకు అనుమతులు తీసుకురావాల్సిన రాష్ట్ర ప్రభుత్వం పులివెందులకు వచ్చిన 50 సీట్లు కూడా వసతులు కల్పించలేమని ఎన్‌ఎంసికి లేఖ రాయడం ఏమిటని ప్రశ్నించారు. ఒక్క పాడేరుకే 50 సీట్లు వచ్చాయని, మిగిలిన 4 కళాశాలలకు నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఎల్‌ఒపి ఇచ్చి ఉంటే అనుమతులు లభించి ఉండేవని తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్యపు చర్య వల్ల 700 సీట్లు కోల్పోయామని చెప్పారు. ఇది కేవలం వైద్య విద్యను ప్రయివేటీకరణ చేయాలనే దుర్మార్గపు ఆలోచనల నుంచి చేస్తున్న చర్యగా భావిస్తున్నామని తెలిపారు. ప్రయివేటీకరణ జరిగితే ఎంతో మంది పేద, మధ్య తరగతి విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతారని చెప్పారు. రిజర్వేషన్ల ఊసే ఉండదని, వెనుకబడిన తరగతుల విద్యార్థులకు నష్టం జరుగుతుందని అన్నారు. భవిష్యత్తులో ఉచిత వైద్య సేవలు కూడా పేదలకు అందవని ఆవేదన వ్యక్తం చేశారు.

జెసికి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

పెండింగ్ వేతనాలు చెల్లించాలి : వ్యకాస

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

గత పది వారాలుగా ఉపాధి హామీ వేతనాలు పెండింగ్‌లో ఉన్నప్పటికీ కూలీలకు ఇప్పటివరకు అందించలేదని, తక్షణమే వేతనాలు అందించాలని వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న, మండల కార్యదర్శి రామాంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని పాండవగల్ గ్రామంలో ఉపాధి హామీ చట్టంలో భాగంగా ఫారంపాండ్స్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 33 మంది కూలీలు రెండు రోజులపాటు పని చేస్తున్నారని, నేల గట్టిగా ఉండడం వల్ల కూలీలు బిందెలతో నీళ్లు మోసుకొని పని చేస్తున్నారని తెలిపారు. రెండు రోజులకు కలిపి కేవలం ఆరు మీటర్ల వెడల్పుతో ఒక మీటరు లోతు పని జరిగిందని చెప్పారు. ఈ ఫారంపాండ్స్ పనులు వేసవిలో చేయడం అసాధ్యమని అర్థమవుతోందని, ప్రభుత్వం కచ్చితంగా ప్రతి గ్రామంలో 20 ఫారంపాండ్స్ తవ్వాలని లక్ష్యం పెట్టిందని తెలిపారు. కూలీలు చేయడానికి పనులు లేని సమయంలో ముమ్మరంగా పనులు కల్పించాల్సి ఉండగా ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వం లక్ష్యం పెట్టడం సరైంది కాదని విమర్శించారు. ఫారంపాండ్స్ పనులు కాకుండా ఫీడర్ ఛానెల్, చెరువుల్లో పూడకతీత పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెండింగ్‌లో ఉన్న ఉపాధి బిల్లులు చెల్లించాలని, ఫారంపాండ్స్ పనులు కాకుండా వేరే పనులు కల్పించాలని కోరారు.

'అంబేద్కర్'ను అవమానించిన 'కూటమి'

- కెవిపిఎస్, మాల మహానాడు నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించకుండా కూటమి ప్రభుత్వం అవమానపరిచిందని మాల మహానాడు జిల్లా అధ్యక్షులు గుడిసె మహానంది, కెవిపిఎస్ నాయకులు తిక్కప్ప విమర్శించారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ గ్రౌండ్ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గత 30 ఏళ్ల నుంచి ఏ పార్టీ అధికారంలో ఉన్నా అంబేద్కర్ జయంతిని ప్రభుత్వమే ఘనంగా నిర్వహించేదన్నారు. టిడిపి, జనసేన పార్టీలు కూటమిలోకి బిజెపి చేరడంతో అంబేద్కర్ జయంతిని అవమానపరిచే విధంగా, ఆయన రాసిన రాజ్యాంగాన్ని మార్చాలన్న ఉద్దేశంతో బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తెలిపారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం కూడా వత్తాసు పలుకుతోందని చెప్పారు. విజయవాడలో నిర్మించిన 125 అడుగుల ఎత్తులో సామాజిక న్యాయ మహా శిల్పాన్ని నిర్మిస్తే కూటమి ప్రభుత్వం పట్టించుకోకుండా ఆ శిల్పాన్ని ప్రయివేట్ వారికి అప్పగించి సొమ్ము చేసుకోవాలని ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. ఆ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ జయంతిని కూటమి ప్రభుత్వం అధికారికంగా నిర్వహించలేదని నిరసిస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మళ్లీ నిర్వహిస్తామని తెలిపారు. మరకట్టు కృష్ణ, ములుగుందం సర్పంచి భర్త ఏసోబు, రాజు, బసాపురం ఈరన్న, వెంకటేష్, కుమార్, రవి వెంకటరాముడు ఉన్నారు.

మాట్లాడుతున్న నాయకులు